# అమ్మాయి పెద్దమనిషయింది!

కమలా వసంతకుమార్

సెలవు రోజులు. అందుకని సుజీ నిదానంగా నిద్ర లేచింది. పన్లు కూడా హడావిడి పడకుండా నిదానంగానే చేసుకున్నది. సుజీ తల్లి సీత కూడా ఆ అమ్మాయిని 'ఆపని చెయ్యి; ఈపని చెయ్యి' అని, పన్లు చెప్పదు. ఎందుకంటే – సీతకూ, ప్రకాశానికీ సుజీ ఏకైక సంతానం–అందుకని కాస్త ముద్దు.

సుజీకి తొమ్మిదేళ్ళు నిండి, పదిమాసాలయినాయి. లంగా, గౌనూ వేసుకుని–రెండు జడలు వేసుకుని ఆడుతూ పాడుతూ వుంటుంది.

స్నానం అదీ అయిన తర్వాత సుజీ తన దగ్గర బంధువుల పిల్లలతో వైకుంఠపాళీ ఆడుకుంటున్నది. ఆట ఆడుతున్నప్పుడల్లా, ఆ అమ్మాయికి ఒకటే–జాగ్రత్త! తన గవ్వను పాము మింగేయకూడదు! గవ్వలు వేస్తున్నప్పుడు ఎలాగోలా 'అష్ట' వెయ్యడానికే ప్రయత్నించేది.... కాని, ఆ సాయంకాలం తను ఆట ఆడడానికి వీల్లేకపోయింది!


సాయంకాలం నాలుగ్గంటలకు సీత, సుజీని పిలిచింది–తల దువ్వి, జడలు వెయ్యడానికి. తలకు శుభ్రంగా నూనె రాసింది; జుట్టును పాయలుగా విడదీసి నున్నగా దువ్వింది; జడలు వేసింది; రిబ్బన్లు కట్టింది. "వెళ్ళి ఆడుకో" అంది సీత. సుజీ లేచి నిలబడి, లంగా కిందికి జారవిడిచింది. టక్కున సీత కళ్ళు సుజీ లంగా మీద పడ్డాయి. ఆమెకు 'ఎర్రగా' మచ్చలాంటిది కనిపించింది. సీతకేమీ తోచలేదు. ముందు ఎందుకో కంగారుపడిపోయింది; తర్వాత సుజీని వెళ్ళి బట్టలు మార్చుకుని రమ్మన్నది. సుజీకి విషయం ఏమీ తెలీదు. అమ్మ ఎందుకు బట్టలు మార్చుకోమన్నదో కూడా తెలీదు. వెళ్ళి బట్టలు మార్చుకుని, ఆటలో కూచున్నది.

రాత్రి ఏడు గంటలప్పుడు సీతకు మళ్ళీ సుజీ లంగామీద 'ఎర్రని మచ్చ' కనిపించింది. దాంతో సీత–సుజీ 'పెద్దమనిషి' అయిందని నిర్ధారణ చేసుకున్నది. "సుజీ, నీవంట్లో ఎలా వుంది?" అని అడిగింది – సీత. "కాళ్ళు లాగుతున్నట్టున్నాయి. అంతేగాని, ఇంకేమీలేదు" అన్నది సుజీ. అప్పుడు కూడా సీత, సుజీకి ఏమీ చెప్పలేదు....

వంట ఇంటికి ఎదురుగా వున్న పెద్ద బీరువా వెనుక సుజీని కూచోమన్నది–సీత. ఏమిటో, ఎందుకో అర్థంకాని కళ్ళతో చూసింది–సుజీ. "వెధవ ప్రశ్నలేం వెయ్యకుండా, చెప్పినట్టు విని, వెళ్ళి అక్కడ కూచో" అన్నది–సీత. సుజీ వెళ్ళి కూచున్నది.

కళ్ళలో నీళ్ళు తిరుగుతూ వుండగా సీత వెళ్ళి, అత్తగారికి రహస్యంగా ఏదో చెప్పింది. అత్తగారు, తన పెద్దమ్మాయితో చెప్పింది. ఇద్దరూ కలిసి తొందర తొందరగా బీరువా దగ్గిరకొచ్చారు–సుజీని చూడ్డానికి.

అత్తగారు సీతను పంచాంగం తెమ్మంది. సీత గబగబా వెళ్ళి, ఎక్కడో మూల బూజు కొట్టుకుని వున్న పంచాంగాన్ని వెతికి తీసుకొచ్చి ఇచ్చింది. అత్తగారు, కళ్ళజోడు పెట్టుకుని పంచాంగం చూసి, 'అష్టమి'లో సుజీ పెద్దమనిషయిందని చెప్పింది. నక్షత్రం – మూల. తర్వాత ఏం చెయ్యాలి....? అందరూ ఆలోచనలో పడ్డారు.



ఈలోగా సుజీతో 'వైకుంఠపాళీ' ఆడిన అమ్మాయిలందరూ వచ్చి, దూరంగా నించుని సుజీని వింతగా చూడటం మొదలు పెట్టారు. సుజీకి ఏమీ అర్థంకాలేదు. అందరివేపూ అదోలా చూడసాగింది. అందరూ తనను ఎందుకలా వింతగా చూస్తున్నారు? వెలివేసినట్టుగా ఎందుకలా కూచోపెట్టారు....? తను అడగకూడదు కాబోలు! అడిగినా చెప్పరు....ఎందుకని....ఏమిటది?

"ప్రకాశం ఆఫీసు నుంచి వస్తేగాని ఏమీ చెయ్యలేం" అన్నది తల్లి. ఆయన ఎందుకని ఇంకా రాలేదు?....అనుకుంది సీత. కాలుగాలిన పిల్లుల్లా అందరూ అటూ యిటూ తిరగడం మొదలుపెట్టారు. రాత్రి ఎనిమిది గంటలయినా కూడా ప్రకాశం రాలేదు. అతని సైకిల్ బెల్ వినిపిస్తుందేమోనని, అందరూ ఎదురు చూస్తూనే వున్నారు. ఇక లాభం లేదని, ప్రకాశానికి ఫోన్ చేసి, రమ్మనాలి అనుకున్నారు. 'నల్లకోమటి' షాపుకి వెళ్ళి ఫోన్ చెయ్యాలి. ఈ విషయం అక్కడ ఎవరన్నా వుండి, వింటే బావుండదు! అందుకని విషయం చెప్పకుండా అర్జంటుగా బయల్దేరి రమ్మన్నారు.

తొమ్మిది గంటలకు ప్రకాశం ఆదరా బాదరాగా సైకిల్ తొక్కుకుంటూ వచ్చాడు. "ఏమిటర్రా?–ఏం జరిగింది?" అన్నాడు లోపలకొస్తూనే కంగారుగా. ఎవరూ ఏమీ మాట్లాడలేదు. అందరూ కొయ్యబొమ్మల్లా నించున్నారు. అక్కడ అతనికి సీత కనిపించలేదు. సీతకు ఏమైందో ఏమిటోనని, కంగారుగా లోపలికి పరుగెత్తాడు. సీత వంట ఇంటి గుమ్మందగ్గర నించుని, వస్తున్న కన్నీళ్లను ఆపుకుంటున్నది. ప్రకాశానికి మతిపోయింది....! అతని దృష్టి వెంటనే సుజీ మీద పడింది. బీరువా వెనక, చాప మీద ఒంటరిగా కూచున్న సుజీని చూసి అతను విషయం అర్థం చేసుకున్నాడు. తండ్రిని చూడగానే, సుజీ ఘొల్లుమని ఏడ్చేసింది. తనకు ఏం జరిగింది? ఎందుకిలా దూరంగా

కూచోమన్నారు? అడిగితే చెప్పరెందుకని? — ఏమీ అర్థం కాకపోయినా, ఆ మధ్య తన పెద్దమ్మ కూతురు సుబ్బులుకు జరిగినట్టుగానే, తనకూ ఏదో జరిగి వుంటుందని మాత్రం అనుకున్నది.


సుజీకి సీత - తలంటి స్నానం చేయించింది. తన బట్టలు తనే ఉతుక్కుంది సుజీ. ఆ రాత్రి ఆ అమ్మాయికి పాలూ అన్నం మాత్రం పెట్టారు. సీత అత్తగారు "నాలుగు రోజులదాకా, దానికి కారం రుచి చూపించకు" అన్నది. 'అలాగే' అన్నది సీత. బహుశా సీత అత్తగారికి, ఆమె పెద్దమనిషి అయినప్పుడు, వాళ్ళ అమ్మగారు అలాగే చెప్పి వుంటుంది! అదే, ఆమె కూడా ఇప్పుడు చెప్పింది....

మన ఆచారాల్లో అమ్మాయి పెద్దపిల్ల కావడం ఎందుకనో ఏదో నేరంలా కనిపిస్తుంది. ప్రాకృతిక మైన ఈ విషయం గురించి భయం ఎందుకో, అందులో అంత చెప్పరానిదేమిటో ఎవరికీ అర్థంకాదు!

ఇలాంటి ఆహారం పెట్టకూడదనడానికి, ఏ కోశానా, ఎక్కడా ఏ వైద్య విధానంలోనూ ఆధారాలు లేవు! నిజానికి ఇలాంటి సమయాల్లో మంచి పోషకాహారం ఇవ్వాలి. ప్రొటీన్లు, ఇనుము శక్తి బాగా వున్న ఆహార పదార్థాలు ఇవ్వాలి. రక్తం పోవడంవల్ల 'ఇనుము' నష్టం జరుగుతుంది కాబట్టి, అది బాగా ఇవ్వాల్సిన అవసరం వుంది. బహిష్టు కావడానికీ, కారం తినకపోవడానికీ ఏమీ సంబంధం లేదు; ఏ ఆధారమూ లేదు....

ఆ అమ్మాయికి ఏ విషయమూ చెప్పకుండా, ఏదో భూతం ఆవరించిన దానిలా అందరూ చూడడం, ఏం అడిగినా చెప్పకపోవడం, అన్నీ రహస్యాలుగా వుంచడం — అనాదిగా వస్తున్న మన మూఢ నమ్మకాలు. దానివల్ల ఆ అమ్మాయి ఎంత భయపడి పోతుంది? మానసికంగా ఎంత క్రుంగిపోతుంది? — ప్రకృతి సిద్ధమైన ఇటువంటి విషయాలను చూసినప్పుడు, విన్నప్పుడూ అందరూ ఎందుకని భయపడిపోయి, బెంబేలు పడిపోతారో అర్థం కాదు!

మర్నాడు ఉదయం సుజీ వైకుంఠపాళీ ఆడ దానికి సిద్ధమైతే, తక్కిన అమ్మాయిలు ఒప్పుకో లేదు. "నాలుగు రోజులవరకూ నువ్వు మాతో ఆడకూడదు" అన్నారు. దూరంగా కూచుని, వాళ్ళు ఆడుకుంటూ వుంటే — గవ్వలతో 'అష్ట' వేసి - విచ్చెన ఎక్కాలన్న ఆలోచనలో పడి పోయింది, సీత. *



ప్రధానమంత్రి శ్రీ మొరార్జీదేశాయ్ ఇటీవల మద్రాసుకు వచ్చినప్పుడు మద్రాసు గవర్నర్ నివాసమైన రాజ్ భవన్‌లో కస్తూరిబాయి గాంధి చిత్రాన్ని ఆవిష్కరిం చారు. ఆ సందర్భంగా ఆయన కస్తూరిబాయి గుణగణాలను ప్రశంసిస్తూ, ఆమె తమకు పదహారేళ్ళు నిండక ముందే గాంధీ మహాత్ముడికి సత్యాగ్రహం ఎంతటి బలమైనదో తెలియజేశారని చెప్పారు. 'భర్తపట్ల తమకెంత భక్తి ఉన్నా, తాము పుట్టినింటికి వెళ్ళడానికి ఆయన అభ్యంతరం తెలిపి నప్పుడు ఆమె తమ ఆత్మగౌరవాన్నీ, స్వాతంత్ర్యాన్నీ ప్రదర్శించి సత్యాగ్రహం చేసి గాంధీజీని మార్చారు' అన్నారు ఆయన. 'కస్తూరిబాయి మూర్తీభవించిన స్త్రీత్వం' అని పేర్కొని, ప్రాతఃస్మరణీయులైన గొప్ప వనితలతో ఆమెను కూడా పోల్చవచ్చు నన్నారు. మద్రాసు గవర్నరు శ్రీ ప్రభుదాస్ పట్వారీ 'కస్తూరిబాయి ఆదర్శ వనిత మాత్రమే కాదు. జీవితంలోని స్వచ్ఛమైన, దివ్యమైన అంశాలన్నిటికి ఆమె సంరక్షకురాలు.' అన్నారు. కస్తూరిబాయి చిత్రాన్ని రూపొందించిన సి. జె. అంతోనీదాస్ (మద్రాస్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్)కు ప్రధానమంత్రి శ్రీ మొరార్జీదేశాయి మెమెంటో బహుకరించారు.

కస్తూరిబాయి చిత్రం రాజ్‌భవన్‌లోని భోజనాల హాలులో ఉంచుతారు. ఆ హాలుకు 'కస్తూర్బా అన్నపూర్ణ హాల్' అని పేరు పెడతారు.

## వనిత మాటల కొలువు—22

సరైన సమాధానం:

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 ఐ | జ్ఞా | 12 వ | 13 ము | | 2 గ | రి | 14 క |
| జ్ఞ | | 3 గా | డి | | వే | | ము |
| ప్తి | | రా | | 4 న్లై | ష | | ద |
| | 15 ప | | 16 కా | | 5 జా | 17 గ | న |
| 6 నౌ | రి | కే | ళ | 18 ము | | డి | |
| | జ | | 7 రా | కు | మా | | 19 బో |
| 8 గా | న | ము | | ళ | | 9 వే | ణి |
| 10 రు | ము | | 11 అ | ము | ఖ | ము | |

పై సమాధానంతో సరిపోయే సమాధానాలు పంపినవారు ఐదుగురు. వారు:

1. పెమ్మరాజు శకుంతల, బెంగళూరు-3
2. పి. శేషాసుందరి, మద్రాసు-33
3. బులుసు రామలక్ష్మి, విజయనగరం-2
4. ఎ. తులసీలక్ష్మి, పార్వతీపురం
5. జె. రాణి, మద్రాసు-24

బహుమతి మొత్తం రూ. 150లను ఈ ఐదుగురికి సమానంగా పంచి, అందజేస్తున్నాము.